వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 05 | సంచిక : 046
పేజీలు : 08 | వెల: రూ.5/-
బుధవారం
జనవరి 28, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




## మేడారంలో విషాదం

- జంపన్న వాగులో కొట్టుకుపోయి ఒకరి మృతి
- మంచిర్యాల జిల్లాకు చెందిన కిరణ్‌గా గుర్తింపు

2లో..

# ధిక్కార స్వరం... మేడారం

## గద్దెకు చేరిన సారలమ్మ



గుడి లేదు.. గోపురం లేదు.. అర్చన లేదు అభిషేకం అంత కన్నాలేదు.. తీర్థం లేదు తీయని లడ్డూ లేదు.. మడి లేదు మంగళహారతి లేదు.. కొలవడానికి ఓ రూపం లేదు.. కలవడానికి ప్రత్యేక దారుల్లేవు.. ఉన్నదొక్కటే నమ్మకం 'అమ్మా' అంటే.. నేనున్నా బిడ్డా అనే నమ్మకం. ఆ నమ్మకమే అడవి బిడ్డల ఆరాధ్య దైవం మహాజనుల జాతర 'సమ్మక్క సారక్క'జాతరగా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. నాలుగు రోజులపాటు సాగే జాతరలో బుధవారం మొదటి ఘట్టం పూర్తయింది. డప్పు చప్పుళ్లు, గిరిజనుల కోలాహలం మధ్య పూజారులు కన్నెపల్లి నుంచి సారలమ్మను మేడారం గద్దెకు చేర్చారు. అక్కడే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.



వివరాలు2లో..

- అన్యాయంపై అడవి బిడ్డల గెరిల్లా పోరాటం
- గిరిజన ఆత్మగౌరవ ప్రతీక | త్యాగధనుల వీరగాథ
- ఆదివాసీల అతిపెద్ద కుంభమేళా
- భక్తి, వీరత్వం మేళవించిన ఆధ్యాత్మిక సంస్కృతి

అది కేవలం జనారణ్యం కాదు.. గిరిజన గుండెల్లో రగిలిన ఆత్మగౌరవ జ్వాల! అది కేవలం ఒక ఉత్సవం కాదు.. కాకతీయ సామంతుల అణిచివేతపై అడవి బిడ్డలు ఎక్కుపెట్టిన విల్లంబుల వీరగాథ! తెలంగాణ గిరిజన సంస్కృతికి తలమానికంగా, ఆధ్యాత్మికతకు మకుటాయమానంగా నిలిచే సమ్మక్క-సారలమ్మల మహాజాతర కోట్లాది మంది భక్తుల పాలిట కొంగుబంగారమై వెలుగొందుతోంది. ముక్కోటి దేవతల సాక్షిగా మాఘశుద్ధ పౌర్ణమి వేళ మేడారం అడవుల్లో సాగే ఈ వీరత్వ చరిత్ర.. ఒకవైపు త్యాగాన్ని, మరోవైపు అన్యాయంపై ధర్మపోరాటాన్ని లోకానికి చాటిచెబుతోంది. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన కుంభమేళాగా ఖ్యాతిగాంచిన ఈ జాతర, తరాలు మారుతున్నా తరగని భక్తికి, వీడని వీరత్వానికి నేటికీ సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. - వరంగల్ వాయిస్, మేడారం



## మీడియా ప్రతినిధులకు టీ-షర్టులు

- పంపిణీ చేసిన మంత్రి సీతక్క

2లో..

## గుప్పుమంటున్న గుడుంబా

- సమ్మక్క, సారలమ్మ పేరిట బెల్లం, పటిక అమ్మకాలు
- పరకాల కేంద్రంగా చీకటి దందా కోట్లకు పడగెత్తిన వ్యాపారులు

6లో..





6లో..

## చిన్న మేడారం భక్తజన సందోహం

- భక్తి పరవశంలో మునిగిన అగ్రంపాడు
- వనాన్ని గద్దెకు తెచ్చిన పూజారులు

వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
బుధవారం, జనవరి 28, 2026

# ధిక్కార స్వరం.. మేడారం



- అన్యాయంపై అడవి బిడ్డల గెరిల్లా పోరాటం
- గిరిజన ఆత్మగౌరవ ప్రతీక
- త్యాగధనుల వీరగాథ
- ఆదివాసీల అతిపెద్ద కుంభమేళా
- భక్తి, వీరత్వం మేళవించిన ఆధ్యాత్మిక సంస్కృతి

తెలంగాణ రాష్ట్ర గిరిజన సంస్కృతికి, ఆధ్యాత్మికతకు మకుటాయమానం మేడారం జాతర. ఇది కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, కాకతీయుల కాలం నాటి ధర్మపోరాటం. వీరత్వం, అడవి బిడ్డల ఆత్మగౌరవానికి నిలువెత్తు సాక్ష్యం. కోట్లాది మంది భక్తుల కొంగుబంగారంగా వెలుగొందుతున్న సమ్మక్క–సారలమ్మల చారిత్రక నేపథ్యం అత్యంత స్ఫూర్తిదాయకం. జగిత్యాల పొలవాస ప్రాంత ప్రభువు మేడరాజుకు వేటలో ఒక పుట్ట వద్ద పసిపాపగా సమ్మక్క లభించింది. క్రూర మృగాల మధ్య సురక్షితంగా ఉన్న ఆ బాలికను దైవాంశ సంభూతురాలిగా భావించి, అల్లారుముద్దుగా పెంచారు. అనంతరం మేడారం పాలకుడు పగిడిద్దరాజుతో ఆమెకు వివాహం జరిగింది. వారికి సారలమ్మ, నాగులమ్మ, జంపన్న అనే ముగ్గురు సంతానం. ప్రజల కష్టాలను తీరుస్తూ, ఆకుపసరులతో వ్యాధులను నయం చేస్తూ సమ్మక్క నిత్యం ప్రజల ఆరాధ్య దైవంగా వెలిగారు.

### కాకతీయులతో పోరు..

కాకతీయ సామ్రాజ్య విస్తరణ కాంక్ష, కరువు కాలంలోనూ కప్పం కట్టాలన్న ఒత్తిడి యుద్ధానికి దారితీశాయి. మాఘ శుద్ధ పౌర్ణమి వేళ ప్రతాపరుద్రుని సేనలు మేడారంపై దాడి చేశాయి. అపారమైన కాకతీయ సైన్యాన్ని గిరిజనులు గెరిల్లా యుద్ధంతో ధీటుగా ఎదుర్కొన్నారు. ఈ పోరులో పగిడిద్దరాజు, సారలమ్మ, నాగులమ్మ, గోవిందరాజులు వీరమరణం పొందారు. ఓటమిని తట్టుకోలేక సమ్మక్క కుమారుడు జంపన్న 'సంపెంగ వాగు'లో దూకి ఆత్మాహుతి చేసుకున్నాడు. ఆయన జ్ఞాపకార్థం ఆ వాగు నేడు 'జంపన్న వాగు'గా పిలవబడుతోంది.

### పసుపు-కుంకుమగా ..

కళ్లముందే కన్నబిడ్డలు నేలకొరిగారు.. తోడున్న భర్త వీరమరణం పొందాడు.. రక్తసంబంధీకులంతా రణక్షేత్రంలో బలైపోయారు. అయినా ఆ వీరమాత వెనకడుగు వేయలేదు. ఒంటరిగానే కాకతీయ సేనలపై సింహంలా విరుచుకుపడింది. శత్రువుల కత్తులు శరీరాన్ని చీలుస్తున్నా, ఒళ్లంతా గాయాలై రక్తపు ధారలు ప్రవహిస్తున్నా.. ఆత్మగౌరవం కోసం ఆఖరి శ్వాస వరకు పోరాడింది సమ్మక్క. శత్రువుల చేతికి చిక్కకూడదనే లక్ష్యంతో, రణరంగం నుంచి చిలుకల గుట్ట వైపు సాగిన ఆమె ప్రస్థానం అక్కడే అదృశ్యమైంది. తన కోసం వెతుక్కుంటూ వచ్చిన అనుచరులకు చివరకు కనిపించింది అమ్మవారి రూపం కాదు.. ఒక పుట్ట వద్ద మెరుస్తున్న 'పసుపు–కుంకుమల భరిణె'. ఆ తల్లే అగ్నిపునీతమై మన కోసం ఆ రూపంలో నిలిచిందని నమ్మిన గిరిజనం, నాటి నుంచి ఆ భరిణెనే దైవంగా కొలుస్తున్నారు. ఆ త్యాగమే నేడు మేడారంలో కోట్లాది మంది భక్తుల నమ్మకమై, నీరాజనాలు అందుకుంటోంది.

### నాలుగు రోజుల మహా సంబరం..

ప్రతి రెండేళ్లకోసారి జరిగే ఈ జాతరలో నాలుగు ప్రధాన ఘట్టాలు అద్భుతంగా కనువిందు చేస్తాయి. మొదటి రోజు బుధవారం సాయంత్రం కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దెకు తీసుకురావడం. ఇదే రోజు పగిడిద్దరాజు, గోవిందరాజులు కూడా గద్దెను చేరుకుంటారు. రెండవ రోజు గురువారం సాయంత్రం చిలుకల గుట్ట నుంచి భరిణె రూపంలో సమ్మక్కను తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్టిస్తారు. దీంతో మేడారం గద్దెలకు సంపూర్ణత్వం వస్తుంది. మూడో రోజు శుక్రవారం గద్దెలపై కొలువై ఉన్న తల్లీకూతుళ్లు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ రోజు భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. నాలుగవ రోజు శనివారం దేవతలను తిరిగి వనప్రవేశం చేయించడంతో పాటు పగిడిద్దరాజు, గోవిందరాజులు వారి వారి సంస్థానాలకు చేరుకుంటారు. దీంతో నాలుగు రోజులపాటు అంగరంగ వైభవంగా జరిగిన మేడారం జాతర ముగుస్తుంది.

### జన సముద్రం..

అది జన సముద్రమో.. భక్తి సామ్రాజ్యమో అర్థం కాని రీతిలో మేడారం గడ్డ పులకిస్తోంది. కోటికి పైగా భక్తులు అడుగులు వేస్తూ, గిరిజన త్యాగానికి జయజయధ్వానాలు పలుకుతున్నారు. అన్యాయంపై అడవి బిడ్డలు సాగించిన ఆ వీరోచిత తిరుగుబాటుకు కాలం చెరపలేని సజీవ సాక్ష్యం ఈ మహోత్సవం. తమ కష్టాలను తీర్చే అమ్మవార్లకు భక్తులు తమ భక్తిని చాటుకుంటూ, నిలువెత్తు 'బంగారం' (బెల్లం) సమర్పించి మొక్కులు చెల్లించుకోవడం ఇక్కడి ప్రత్యేకత. భక్తుల అచంచల విశ్వాసం, అంతులేని జనవాహిని వెరసి మేడారాన్ని ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా గ్లోబల్ మ్యాప్‌లో నిలబెట్టాయి. ఇది కేవలం ఒక ఉత్సవం కాదు.. తరాలు దాటిన ఒక మహా ప్రస్థానం!

## తల్లుల స్ఫూర్తితోనే పాలన..

**- సీఎం రేవంత్ రెడ్డి**



మేడారం తల్లుల స్ఫూర్తితో జరిపిన ప్రజాస్వామ్య పోరాటం వల్లే నేడు రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా మేడారంలోనే మంత్రిమండలి సమావేశం నిర్వహించి, వనదేవతల పట్ల తమకున్న భక్తిని చాటుకున్నామని గుర్తు చేశారు. ప్రజల కోసం ప్రాణాలైనా అర్పించిన ఆ తల్లుల స్ఫూర్తితోనే రాష్ట్ర అభివృద్ధికి పునరంకితమవుతామని స్పష్టం చేశారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి, అక్కడి నుంచే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఏర్పాట్లపై సమీక్షించారు. కోటిన్నరకు పైగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులు అధికారులకు సహకరించాలని, ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఆదివాసీల ఆచారాల పరిరక్షణ తమ ప్రభుత్వ బాధ్యత అని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.







## మేడారంలో విషాదం

### జంపన్న వాగులో కొట్టుకుపోయి ఒకరి మృతి

**వరంగల్ వాయిస్, మేడారం :** సమ్మక్క–సారలమ్మల దర్శనం కోసం మేడారం వచ్చిన భక్తులలో ఒకరు జంపన్న వాగులో ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. మంచిర్యాల జిల్లాకు చెందిన కిరణ్ (45) అనే భక్తుడు కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం అమ్మవార్ల దర్శనానికి మేడారం వచ్చాడు. పుణ్యస్నానం ఆచరించేందుకు వాగులోకి దిగిన ఓ భక్తుడు ప్రవాహ ధాటికి కొట్టుకుపోయి మృతి చెందాడు. జాతర సందర్భంగా భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో, సదరు వ్యక్తి స్నానం కోసం జంపన్న వాగులోకి దిగాడు. అయితే నీటి ఉధృతిని గమనించకపోవడంతో ప్రవాహంలో కొట్టుకుపోయాడు. గమనించిన తోటి భక్తులు, రక్షణ సిబ్బంది అప్రమత్తమైనప్పటికీ ఫలితం లేకుండా పోయింది. చివరకు ఆయన మృతదేహాన్ని వెలికితీశారు. జాతరకు వచ్చే భక్తులు జంపన్న వాగులో స్నానాలు చేసే సమయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రవాహం ఎక్కువగా ఉన్న చోట లోతులోకి వెళ్లవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన రక్షణ ప్రాంతాల్లోనే స్నానాలు చేయాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. కళ్లముందే జరిగిన ఘటనతో కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల భక్తులు షాక్ నకు గురయ్యారు. ఈ ఘటనతో జాతర ప్రాంగణంలో ఒక్కసారిగా విషాద ఛాయలు అలముకున్నాయి.





## మీడియా ప్రతినిధులకు టీ-షర్టులు



### పంపిణీ చేసిన మంత్రి సీతక్క

**వరంగల్ వాయిస్, మేడారం :** మేడారం మహాజాతర విధుల్లో నిమగ్నమైన మీడియా ప్రతినిధులకు రాష్ట్ర పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క బుధవారం టీ–షర్టులను పంపిణీ చేశారు. మేడారంలోని మీడియా సెంటర్‌ను సందర్శించిన ఆమె, జాతర విశేషాలను ప్రపంచానికి చాటిచెప్పడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని కొనియాడారు. కష్టతరమైన అటవీ ప్రాంతంలో రేయింబవళ్లు శ్రమిస్తూ భక్తులకు సమాచారాన్ని అందిస్తున్న మీడియా మిత్రుల సేవలను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు, పెద్ద సంఖ్యలో మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదు

- కేటీఆర్‌కు ఎమ్మెల్యే నాయిని బహిరంగ సవాల్
- హనుమకొండ చౌరస్తాలో చర్చకు సిద్ధమా?



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను అడ్డుకోవాలని చూస్తే సహించే ప్రసక్తే లేదని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి బీఆర్ఎస్ నేతలను హెచ్చరించారు. బుధవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్‌లపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధికి, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులకు మధ్య తేడాపై హనుమకొండ చౌరస్తాలో బహిరంగ చర్చకు సిద్ధమా అని కేటీఆర్‌కు నాయిని సవాల్ విసిరారు. "పనిచేసే ప్రభుత్వంపై బురద చల్లడం మానుకోవాలి. మీరు పదేళ్లలో చేయలేని పనులను మేము ఏడాదిలోనే చేసి చూపిస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు. గత పాలకుల హయాంలో కల్పత సూపర్ బజార్ వేదికగా జరిగిన అక్రమాలను ఎమ్మెల్యే ఆధారాలతో సహా బయటపెట్టారు. పని చేయని వారి పేరుతో భినామీలుగా సృష్టించి 24 నెలల్లో సుమారు రూ.28.80 లక్షలు కాజేశారని ఆరోపించారు. డ్రైవర్ లేకపోయినా పెట్రోల్ బిల్లుల పేరిట రూ.9.65 లక్షలు డ్రా చేశారని, మొత్తంగా రూ.50 లక్షల వరకు ప్రజాధనం దుర్వినియోగం అయిందని వెల్లడించారు. మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్‌పై విమర్శలు గుప్పిస్తూ.. ఆయన కేవలం అభివృద్ధి నిరోధకుడిలా మారుతున్నారని నాయిని మండిపడ్డారు. గతంలో మాడ వీధుల పేరుతో పేదలను ఇబ్బంది పెట్టింది బీఆర్ఎస్ నేతలేనని, ఇప్పుడు తాము అభివృద్ధి చేస్తుంటే కుల, మతాల పేరుతో రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎన్జీఓస్ కాలనీ ఫంక్షన్ హాల్‌కు రూ.70వేలు వసూలు చేసేవారని, తాము దానిని రూ.20 వేలకే ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని గుర్తు చేశారు. భద్రకాళి ఆలయ అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియే పూర్తి కాలేదని, కానీ అప్పుడే అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ నేతలు విషప్రచారం చేస్తున్నారని నాయిని ఖండించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటే దానిని దళితులపై దాడిగా చిత్రీకరించడం సిగ్గుచేటన్నారు. రాబోయే ఎన్నికల్లో 26 డివిజన్లలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని, బీజేపీ–బీఆర్ఎస్ పార్టీలు కేవలం డిపాజిట్లు కాపాడుకోవడానికే పోటీ పడుతున్నాయని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్ రావు, ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు జక్కుల రవీందర్, విజయ శ్రీ, పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ జగదీశ్వర్ హఠాన్మరణం



**వరంగల్ వాయిస్, మొగుళ్లపల్లి :** సీనియర్ జర్నలిస్ట్ గోగుల జగదీశ్వర్ హఠాన్మరణం చెందారు. ఆయన మృతి పట్ల జర్నలిస్ట్ లోకం తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. బుధవారం మొగుళ్లపల్లిలో జగదీశ్వర్ పార్థివ దేహానికి ఆయన కుటుంబ సభ్యులు, జర్నలిస్ట్ సహచరులు, మిత్రుల మధ్య అంత్యక్రియలు ముగిశాయి. జగదీశ్వర్ భౌతికకాయాన్ని దర్శించుకున్న పలువురు జర్నలిస్ట్ సంఘాల నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆన్‌లైన్ మీడియా వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి, ఢీంబాయ్ టీవీ సీఈవో వేముల సదానందం నేత, జర్నలిస్టు సంఘం హౌసింగ్, వెల్ఫేర్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వల్లాల వెంకటరమణ, ఆంధ్రప్రభ ప్రతినిధి మెండు రవీందర్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, జర్నలిస్ట్ రంగానికి ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అంత్యక్రియల కార్యక్రమంలో జర్నలిస్టులు చింతకింది గణేష్, రాళ్ళబండి శ్రీనివాస్, క్యాతం సతీష్, పలువురు స్థానిక నాయకులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

## అగ్రంపహాడ్ జాతరలో ముమ్మరంగా పారిశుధ్య పనులు

### పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణ



**వరంగల్ వాయిస్, దామెర :** మండలం అగ్రంపహాడ్ గ్రామంలో అత్యంత వైభవంగా జరుగుతున్న శ్రీ సమ్మక్క–సారలమ్మ జాతరలో భక్తుల సౌకర్యార్థం పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు స్వయంగా పనులను పర్యవేక్షిస్తున్నారు. జాతరకు వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా గద్దెల ఆవరణంతో పాటు, చుట్టుపక్కల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నారు. పారిశుధ్య కార్మికులతో రోడ్లపై పేరుకుపోయిన చెత్తను తొలగిస్తూ, అంటువ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లించే కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తున్నారు. భక్తులు బస చేసే ప్రాంతాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, పారిశుధ్యం విషయంలో ఎక్కడా రాజీ పడకుండా చర్యలు తీసుకుంటున్నామని పంచాయతీ కార్యదర్శులు తెలిపారు.

# మేడారంలో ఆయుష్ వైద్యం 'భేష్'

- ఆరు వేల మందికిపైగా ఉచిత చికిత్స



**వరంగల్ వాయిస్, మేడారం :** ప్రతిష్టాత్మక సమ్మక్క–సారలమ్మ మేడారం మహాజాతరకు వచ్చే భక్తులకు ఆరోగ్య భరోసా కల్పించడంలో 'ఆయుష్'విభాగం అగ్రభాగాన నిలుస్తోంది. జాతరలో భాగంగా ఏర్పాటు చేసిన ఉచిత ఆయుష్ వైద్య శిబిరం ద్వారా ఇప్పటికే 6 వేల మందికి పైగా భక్తులు వైద్య సేవలు పొందారు. సంప్రదాయ వైద్యంపై భక్తుల్లో పెరుగుతున్న ఆదరణకు ఈ గణాంకాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. జనవరి 6 నుంచి ప్రారంభమైన ఈ వైద్య సేవలకు రోజురోజుకూ డిమాండ్ పెరుగుతోంది. సాధారణంగా జాతరలో సుదీర్ఘ నడక కారణంగా వచ్చే కాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులతో పాటు జలుబు, దగ్గు వంటి సమస్యలతో బాధపడే వారు అధికంగా ఆయుష్ శిబిరాన్ని ఆశ్రయిస్తున్నారు. కేవలం ఒక్కరోజే 828 మంది చికిత్స పొందగా, అందులో ఆయుర్వేద విభాగాన్ని 286 మంది, హోమియోపతిని 329 మంది, యునానీ విభాగాన్ని 223 మంది సందర్శించారు. జాతరకు వచ్చే రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పూర్తిస్థాయిలో వైద్యులను, సిబ్బందిని కేటాయించింది. 25 నుంచి 30 మంది సిబ్బంది నిరంతరం విధుల్లో ఉంటున్నారు. ముగ్గురు స్పెషలిస్ట్ డాక్టర్లతో పాటు ఫార్మాసిస్టులు అందుబాటులో ఉన్నారు. ఎలాంటి కొరత లేకుండా అన్ని రకాల ఆయుష్ మందులను ముందుగానే నిల్వ ఉంచినట్లు అధికారులు వెల్లడించారు. ఎలాంటి దుష్ప్రభావాలు లేని చికిత్స అందించడం వల్లే భక్తులు ఆయుష్ వైపు మొగ్గు చూపుతున్నారని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు తక్షణ ఉపశమనం అందించడంలో ఈ శిబిరం కీలక పాత్ర పోషిస్తోంది. మేడారం జాతరలో ఈసారి ఆయుష్ సేవలు మరింత విస్తృతంగా, నాణ్యంగా అందుతుండటంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## బీఆర్ఎస్‌లోకి వలసలు



**వరంగల్ వాయిస్, పరకాల :** నియోజకవర్గంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ బలోపేతమే లక్ష్యంగా వలసలు కొనసాగుతున్నాయి. బుధవారం పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన ముఖ్య నాయకులు తిరిగి సొంత గూటికి చేరారు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో 1వ వార్డుకు చెందిన సీనియర్ నాయకుడు బండారి సుగుణాకర్, 5వ వార్డుకు చెందిన యాట ప్రశాంత్ తమ అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పరకాల నియోజకవర్గంలో జరిగిన అద్భుతమైన అభివృద్ధిని చూసి, కేసీఆర్ గారి నాయకత్వంపై నమ్మకంతోనే నాయకులు తిరిగి పార్టీలోకి వస్తున్నారని తెలిపారు. నియోజకవర్గ సంక్షేమం కోసం కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి పనులే తమను తిరిగి పార్టీ వైపు నడిపించాయని, నియోజకవర్గ అభివృద్ధిలో తాము కూడా భాగస్వాములం అవుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అనుచరులు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆల్ షాప్ గుమస్తాల సంఘం పిలుపునిచ్చింది. బుధవారం వరంగల్ పాత బీటు బజార్‌లోని కిరాణం, బెల్లం అసోసియేషన్ యజమానులు బ్రహ్మదేవర వేణు, మాదారపు సదాశివుడులకు 'ఏఐసీటీయూ' ఆధ్వర్యంలో సమ్మె నోటీసును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐసీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి పాల్గొని మాట్లాడుతూ.. వంద ఏళ్ల క్రితం బ్రిటిష్ కాలంలో కార్మికులు రక్తం చిందించి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం రద్దు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. బీటు బజార్‌లోని గుమస్తా కార్మికులందరూ తమ హక్కుల సాధన కోసం ఈ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బావు రామస్వామి, మనోహర్, రాము, వెంకటేశ్వర్లు, మహాత్మ, ప్రత్యూష, సారంగం, మహేష్, వేణు, ఆనంద్, రమేష్, అనూష, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామం సుభిక్షంగా ఉండాలి

### దమ్మన్నపేట సర్పంచ్ ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, దామెర:** మేడారం సమ్మక్క–సారలమ్మ తల్లుల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుతూ దామెర మండలం దమ్మన్నపేట గ్రామ సర్పంచ్ దుబాసీ నవీన్–మానస దంపతులు బుధవారం సమ్మక్క–సారలమ్మలను వేడుకున్నారు. తమ పిల్లలు అనన్య శ్రీ, అనంత్ శ్రేయన్లతో కలిసి వారి గృహంలో సర్పంచ్ కుటుంబం, తల్లులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నవీన్ మాట్లాడుతూ.. తన గ్రామం పాడి పంటలతో వర్ధిల్లి, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వనదేవతలను వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం సమ్మక్క–సారలమ్మ తల్లులకు తమ భక్తిని చాటుకుంటూ 'నిలువెత్తు బంగారం' (బెల్లం) నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సమ్మక్క–సారలమ్మల కృపతో అంతా శుభం కలగాలని ఆకాంక్షించారు.

# పరకాల మున్సిపాలిటీపై కాంగ్రెస్ నజర్

## క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి టీపీసీసీ ఆదేశం



**వరంగల్ వాయిస్, పరకాల :** రానున్న మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ పార్టీ, పరకాల మున్సిపాలిటీపై ప్రత్యేక దృష్టి సారించింది. టీపీసీసీ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా డీసీసీ అధ్యక్షులు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పరకాల మున్సిపాలిటీకి సంబంధించి 11 మందితో కూడిన ఎన్నికల ఇంచార్జ్‌ల జాబితాను విడుదల చేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. పరకాల మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా ఇంచార్జ్‌లను నియమించినట్లు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తెలిపారు. నియమితులైన ఇంచార్జ్‌లు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలతో మమేకం కావాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు, ఇతర సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వివరించాలని స్పష్టం చేశారు."ప్రతి ఓటు పార్టీ విజయానికి కీలకం. ఇంచార్జ్‌లు స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ క్రమశిక్షణతో పని చేయాలి. ప్రజా మద్దతును గెలుపుగా మార్చడమే మన బాధ్యత" అని ఇనగాల పేర్కొన్నారు. వివిధ నియోజకవర్గాలకు చెందిన సీనియర్ నాయకులను పరకాల బాధ్యతలు చూడాల్సిందిగా డీసీసీ నియమించింది. వారిలో బంక సంపత్ (వరంగల్ పశ్చిమ), నాయిని లక్ష్మా రెడ్డి (వరంగల్ పశ్చిమ), బంక సరళ (వరంగల్ పశ్చిమ), పెరుమాండ్ల రామకృష్ణ (పరకాల), ఎనుకోటి నాగరాజు (వరంగల్ పశ్చిమ), బిళ్ల ఉదయ్ కుమార్ రెడ్డి (వర్ధన్నపేట), తంగళ్లపల్లి తిరుపతి (వర్ధన్నపేట), దేవరకొండ అనిల్ కుమార్ (వర్ధన్నపేట), బత్తుల స్వాతి (వర్ధన్నపేట), మేడిపెల్లి మదన్ (వర్ధన్నపేట), గోలి రాజేశ్వర్ రావు (హుస్నాబాద్) లను నియమించింది. ఈ నియామకాలతో పరకాల మున్సిపల్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఇంచార్జ్‌ల రాకతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

# పేదల జోలికి వస్తే సహించేది లేదు

## దాస్యం వినయ్ భాస్కర్ హెచ్చరిక



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యం అని చెబుతూ పేదల ఇళ్లను కూల్చే 'రాక్షస పాలన' సాగిస్తోందని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ మండిపడ్డారు. వరంగల్ భద్రకాళి ఆలయ సమీపంలోని చెరబండ రాజు నగర్ వాసుల ఇళ్లను కూల్చివేస్తారన్న ప్రచారం నేపథ్యంలో మంగళవారం ఆయన బాధితులను స్వయంగా కలిసి వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. గత 30 ఏళ్లుగా ఇక్కడ నివాసం ఉంటున్న పేదలకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాము పట్టాలు ఇచ్చామని, తాగునీరు, విద్యుత్ వంటి కనీస వసతులు కల్పించామని గుర్తు చేశారు. ఇప్పుడు అధికార పార్టీ నాయకుల మాటలు విని అధికారులు ముందస్తు సమాచారం లేకుండా పేదల పొట్టకొట్టాలని చూడటం దారుణమన్నారు. పేదలను భయభ్రాంతులకు గురిచేసేలా నల్లా నీటిని ఆపివేయడం అమానుషమని ధ్వజమెత్తారు. "చిరు వ్యాపారుల పొట్టకొట్టారు.. ఇప్పుడు పేదల గూడు చెడగొట్టాలని చూస్తున్నారు. రాజ్యాంగం, పేదల ప్రభుత్వం అని చెప్పే కాంగ్రెస్ మాటలకు, పనులకు పొంతన లేదు" అని విమర్శించారు. బాధితుల తరపున బీఆర్ఎస్ పార్టీ న్యాయ పోరాటం చేస్తుందని, తక్షణమే నీటి సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే, మేయర్ తమకు అండగా ఉండాల్సింది పోయి కూల్చివేతలకు సహకరిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తరతరాలుగా జీవిస్తున్న ఈ స్థలాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఖాళీ చేసేది లేదని అధికారులను హెచ్చరించారు. నిలిపివేసిన తాగునీటిని వెంటనే పునరుద్ధరించకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామన్నారు.

# 15 ఏళ్లుగా 'బంధీ'గా తెలంగాణ తల్లి

- విగ్రహం ఉంది కానీ ప్రారంభం ఏది?
- అన్నారంలో విగ్రహం చుట్టూ అల్లుకున్న తుప్పలు
- పదేళ్ల స్వరాష్ట్రంలోనూ మోక్షం కలగని వైనం
- పాలకుల నిర్లక్ష్యంపై గ్రామస్థుల ఆగ్రహం

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా నిలవాల్సిన తెలంగాణ తల్లి విగ్రహం పర్వతగిరి మండలంలోని అన్నారం గ్రామంలో 15 ఏళ్లుగా ప్రారంభోత్సవానికి నోచుకోకుండా వెయిటింగ్ లో ఉంది. ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమాలు ఊపిరి పోసుకుంటున్న సమయంలో ఎంతో ఆశగా నిర్మించుకున్న ఈ విగ్రహం, నేడు అధికారుల, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రతి గ్రామంలో తెలంగాణ తల్లి విగ్రహాలను అత్యంత వైభవంగా ప్రతిష్టించుకున్నారు. కానీ అన్నారం గ్రామంలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. గడిచిన బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయని గొప్పగా చెప్పుకుంటున్న నాయకులు, పక్కనే ఉన్న తెలంగాణ తల్లి విగ్రహ ప్రారంభోత్సవాన్ని మాత్రం అటకెక్కించారని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. విగ్రహం నిర్మాణం పూర్తయి 15 ఏళ్లు గడుస్తున్నా.. ప్రారంభం కాకపోవడంతో విగ్రహం చుట్టూ చెత్తాచెదారం, తుప్పలు పేరుకుపోయాయి. కనీసం ఆ ప్రాంగణాన్ని శుభ్రం చేసే నాథుడు కూడా కరువయ్యారు. "రాష్ట్రం వస్తే మా తల్లికి గౌరవం దక్కుతుందని ఆశపడ్డాం, కానీ 15 ఏళ్లుగా విగ్రహం ఇలాగే ఉండటం బాధాకరం" అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



### అధికారుల చొరవ ఏది?..

నాడు నిధులు ఖర్చు చేసి విగ్రహం పెట్టిన నాయకులు గానీ, అధికారులు గానీ దీని ప్రారంభోత్సవం గురించి కనీసం ఆలోచించకపోవడం గమనార్హం. ఇప్పటికైనా స్థానిక నాయకులు, అధికారులు స్పందించి వెంటనే విగ్రహాన్ని శుభ్రం చేయించి, అధికారికంగా ప్రారంభోత్సవం నిర్వహించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

# కాకతీయుల శిల్పకళ అమోఘం

## ఫ్రెంచ్ దంపతులు మేరీ–లోరియట్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాకతీయ రాజుల కాలం నాటి ప్రాచీన కట్టడాలు, నాటి కళాకారులు చెక్కిన శిల్ప సంపద అద్భుతంగా ఉన్నాయని ఫ్రాన్స్ దేశానికి చెందిన పర్యాటక దంపతులు మేరీ–లోరియట్ ప్రశంసించారు. భారతీయ సంస్కృతి, ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలోని చారిత్రక వారసత్వం తమను ఎంతో మంత్రముగ్ధులను చేస్తోందని వారు కొనియాడారు. బుధవారం హనుమకొండ చౌరస్తాలోని మహేంద్ర వస్త్రాలయానికి వస్త్రాల కొనుగోలు నిమిత్తం వచ్చిన ఈ దంపతులను ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ పలకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతదేశంలో లభించే వస్త్రాలు తమ దేశంతో పోలిస్తే ఎంతో మన్నికగా ఉంటాయని, పైగా ఇక్కడ ధరలు, కుట్టుకూలీ కూడా చాలా తక్కువని తెలిపారు. ఈ నాణ్యత నచ్చడం వల్లే ప్రతి సంవత్సరం ఇక్కడికి వస్తామని, ఈసారి కూడా తమ దేశానికి వస్త్రాలు కొనుగోలు చేస్తున్నామని వెల్లడించారు. కాగా, ఈ దంపతులు తమ షాపునకు రావడం ఇది ఎనిమిదో సారి అని యజమాని సుమిత్ కపూర్ గర్వంగా తెలిపారు. వస్త్రాలయంలో ఉన్న శిరిడీ సాయినాథుని చిత్రపటాన్ని చూసిన మేరీ–లోరియట్ దంపతులు ఆయన గురించి ఆసక్తిగా ఆరా తీశారు. నిమ్మల శ్రీనివాస్ వారికి సాయిబాబా జీవిత విశేషాలను, ఆయన అందించిన బోధనలను వివరించగా వారు ఎంతో ప్రభావితమయ్యారు. వచ్చే పర్యటనలో తప్పకుండా శిరిడీని సందర్శిస్తామని ఈ సందర్భంగా వారు ఆకాంక్ష వ్యక్తం చేశారు. విదేశీ పర్యాటకులు స్థానిక సంస్కృతి పట్ల చూపుతున్న మక్కువ అందరినీ ఆకర్షించింది.

# మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో తొర్రూరు పట్టణంలోని మొత్తం 16 వార్డుల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేస్తామని పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం తొర్రూరు పట్టణంలోని 13వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జాటోత్ భద్రు నాయక్, జాటోత్ శ్రీను, జాటోత్ దాసు, జాటోత్ భిక్షు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పాలకుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులమై కాంగ్రెస్‌లో చేరినట్లు వెల్లడించారు. సామాన్య ప్రజల కష్టాలను తీరుస్తున్న పార్టీకి తమ వంతు మద్దతు అందిస్తామని తెలిపారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో తొర్రూరులో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యమని, ప్రతి వార్డులో పార్టీని మరింత బలోపేతం చేస్తామని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు. 13వ వార్డులో కీలక నాయకుల చేరికతో పార్టీకి కొండంత బలం చేకూరిందని కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు ఇట్టె శ్యామ్ సుందర్ రెడ్డి, బిజ్జల అనిల్, మహేష్, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం సీట్లు కేటాయించాలి

## • తాటిపాముల వెంకట్రాములు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రానున్న మున్సిపల్ ఎన్నికలలో రాజకీయ పార్టీలు బీసీలకు 42 శాతం సీట్లు కేటాయించాలని, లేనిపక్షంలో ఆ పార్టీలను బీసీ ద్రోహులుగా పరిగణిస్తామని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు హెచ్చరించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. స్థానిక సంస్థల్లో బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలను ఓటు బ్యాంకు రాజకీయాలకే పరిమితం చేస్తున్నాయని వెంకట్రాములు మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ఆమోదించి కేంద్రానికి పంపి చేతులు దులుపుకుందని, అటు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆ బిల్లులను పెండింగ్‌లో పెట్టి బీసీలకు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అన్ని రంగాల్లో బీసీలను అణచివేస్తున్నాయని ఆయన ధ్వజమెత్తారు. చట్టపరమైన రిజర్వేషన్ల సాకుతో పార్టీలు టికెట్లు నిరాకరిస్తున్నాయని, అయితే ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో బీసీలు జనరల్ స్థానాల్లో పోటీ చేసి 51 శాతం విజయం సాధించడం ద్వారా తమ సత్తా చాటారని గుర్తు చేశారు. ఇప్పుడు జరగబోయే 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల ఎన్నికల్లో కూడా అదే స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలు బీసీలకు 42 శాతం టికెట్లు కేటాయించాల్సిందే. టికెట్లు రాని పక్షంలో బీసీలు ధైర్యంగా జనరల్ స్థానాల్లో పోటీ చేసి విజయదుందుభి మోగించాలి. జనాభా ప్రాతిపదికన చట్టసభలు, విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ల సాధన కోసం బలమైన ప్రజా పోరాటాలు నిర్మిస్తాం. బీసీల హక్కుల కోసం జరిగే ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వెంకట్రాములు విజ్ఞప్తి చేశారు.



# పాఠశాలలోనే పంచాయతీ..

- చదువులకు 'పాలన' ఆటంకం
- ఒకే భవనంలో అంగన్‌వాడీ, బడి, పంచాయతీ ఆఫీసు
- మూడు గదుల మధ్యే ముగ్గురు కొలువు
- కొత్త భవనం కోసం గ్రామస్తుల డిమాండ్
- స్పందించాలని ఎమ్మెల్యేకు విన్నపం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని మొత్యా తండాలో విద్యాబోధన విచిత్ర పరిస్థితుల మధ్య సాగుతోంది. గ్రామ పంచాయతీకి సొంత భవనం లేకపోవడంతో ప్రాథమిక పాఠశాలనే పంచాయతీ కార్యాలయంగా మార్చేశారు. ఫలితంగా అటు విద్యార్థులకు పాఠాలు అందక, ఇటు పాలన సాగక ఉపాధ్యాయులు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. మొత్యా తండా పాఠశాలలో ఉన్నవి కేవలం మూడు గదులు మాత్రమే. ఒక గదిలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తూనే, అదే గదిలో 5వ తరగతి వరకు విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు. రెండవ గదిలో ఉపాధ్యాయులకు స్టాఫ్ రూమ్‌గా వాడుతున్నారు. మూడవ గదిలో గ్రామ పంచాయతీ కార్యాలయం నడుస్తోంది. ఒకే ప్రాంగణంలో బడి, ఆఫీసు ఉండటంతో విద్యార్థులు ఏకాగ్రత కోల్పోతున్నారు. గ్రామస్తులు తమ పనుల నిమిత్తం పంచాయతీ కార్యాలయానికి రావడం, అక్కడ జరిగే చర్చలు, రాకపోకలు చిన్నారుల చదువుకు తీవ్ర అడ్డంకిగా మారాయి.

### నూతన పాలకవర్గంతో మరింత ఇబ్బంది..

గ్రామంలో ప్రస్తుతం నూతన పాలకవర్గం కొలువుదీరడంతో నిత్యం సర్పంచ్, వార్డు సభ్యులను కలవడానికి వచ్చే వారి సంఖ్య పెరిగింది. రాబోయే రోజుల్లో గ్రామ సభలు నిర్వహిస్తే పాఠశాల గదులు చాలక తరగతులు నిలిపివేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన 'పక్కా భవనం' హామీ కేవలం మాటలకే పరిమితమైందని తండా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఎమ్మెల్యే చొరవ చూపాలి..

"ఒకే గదిలో అంగన్‌వాడీ పిల్లలు, పాఠశాల విద్యార్థులు ఉండటం వల్ల ఎవరికీ సరైన న్యాయం జరగడం లేదు. పంచాయతీ పనుల వల్ల వచ్చే గొడవలు, శబ్దాలతో విద్యార్థులు భయపడుతున్నారు" అని గ్రామస్తులు పేర్కొంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే తక్షణమే స్పందించి, మొత్యా తండాకు నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని మంజూరు చేయాలని, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు.

# చాకలి ఐలమ్మ కుటుంబానికి ప్రభుత్వం భరోసా కల్పించాలి

- చాపర్తి కుమార్ గాడ్గే



**వరంగల్ వాయిస్, రాయపర్తి :** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, భూపోరాట వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ వారసులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని బీసీ జానాధికార సమితి, రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే డిమాండ్ చేశారు. బుధవారం రాయపర్తి మండలం కిష్టాపురం గ్రామంలో (ఐలమ్మ జన్మస్థలం) పర్యటించిన ఆయన, ఐలమ్మ కుటుంబ సభ్యులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోటి మహిళా కళాశాలకు ఐలమ్మ పేరు పెట్టి గౌరవించారని, అదే సమయంలో రవీంద్రభారతి వేదికగా ఐలమ్మ మనమడు రామచందర్ కోడలు శ్వేతకు మహిళా కమిషన్ మెంబర్ పదవి ఇస్తామని ప్రకటించారని కుమార్ గుర్తు చేశారు. అయితే, రెండేళ్లు గడుస్తున్నా ఆ పదవికి సంబంధించిన ప్రమాణ స్వీకారం జరగకపోవడం శోచనీయమన్నారు. ఐలమ్మ పుట్టిన ఇల్లు కూలిపోయే స్థితిలో ఉందని, గత ప్రభుత్వాలు ఇచ్చిన డబుల్ బెడ్ రూమ్ హామీలు మాటలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ప్రస్తుత 'ప్రజా ప్రభుత్వం' తక్షణమే స్పందించి ఐలమ్మ వారసులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. సమాజానికి ఆరోగ్యాన్ని, శుభ్రతను అందించే రజక వృత్తి ఎంతో పవిత్రమైనదని కుమార్ గాడ్గే పేర్కొన్నారు. పుట్టిన దగ్గరి నుండి చావు వరకు సేవ చేసే రజకులను వెంటనే ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. అలాగే, కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో పెట్టిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని గుర్తు చేశారు. పాలకుర్తి గడ్డపై ఐలమ్మ వారసురాలినని చెప్పుకున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తిని కొనియాడిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు.. ఇలా అందరూ ఆ తల్లి పేరును వాడుకున్నారే తప్ప, ఆ కుటుంబానికి శాశ్వత న్యాయం చేయలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఐలమ్మ వారసులకు పదవులతో పాటు ఆర్థిక భరోసా కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐలమ్మ కుటుంబ సభ్యులు ఓరుగంటి మదర్, వెంకటమ్మ, కత్తి యాకాంత, ఓరుగంటి ఉప్పలయ్య, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల కొమ్ముకాస్తోంది

- మాస్ లైన్ రాష్ట్ర నేత చంద్రన్న




**వరంగల్ వాయిస్, వరంగల్ :** దేశంలో నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్, పెట్టుబడిదారీ వర్గాల ప్రయోజనాల కోసం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రన్న మండిపడ్డారు. కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం వరంగల్ కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన 'అఖిల భారత నిరసన దినం' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గ్రామీణ పేదలకు జీవనాధారమైన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని శాశ్వతంగా ఎత్తివేసేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని చంద్రన్న ఆరోపించారు. అందులో భాగంగానే 'విబిజి రాంజీ' అనే కొత్త చట్టాన్ని తీసుకువచ్చి నిధులకు కోత పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాల ఆమోదం లేకుండా ఇలాంటి చట్టాలను తీసుకురావడం దేశ సమైక్య స్ఫూర్తికే విరుద్ధమన్నారు. రాజ్యాంగబద్ధ సంస్థల్లో ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్ భావజాలం ఉన్న వ్యక్తులను నింపుతూ ప్రజాస్వామ్య మనుగడను ప్రమాదంలోకి నెడుతున్నారని విమర్శించారు. ఎస్ఐఆర్ (SIR) పేరుతో అర్హులైన ఓటర్లను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, మతోన్మాద దాడులను అరికట్టడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. తక్షణమే విబిజి రాంజీ చట్టాన్ని రద్దు చేసి, ఉపాధి హామీ పథకాన్ని పటిష్టం చేయాలి. కార్మిక హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలి. ఓటర్ల తొలగింపునకు కారణమవుతున్న ఎస్ఐఆర్ విధానాన్ని వెంటనే నిలిపివేయాలి. దేశంలో మైనార్టీలు, సామాన్యులపై జరుగుతున్న మతోన్మాద దాడులను అరికట్టాలి. ఈ కార్యక్రమంలో మాస్ లైన్ జిల్లా నాయకులు చిర్ర సూరి, అర్షం అశోక్, మైదం పాణి, ధార లింగన్న, పీడీఎస్‌యూ నేతలు బి.నరసింహారావు, అజయ్, బాలకృష్ణ, నరేష్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు. డిమాండ్లు నెరవేర్చకుంటే అన్ని వర్గాల ప్రజలను ఐక్యం చేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# మేడారం జాతర వేళ విద్యాసంస్థలకు సెలవు ప్రకటించాలి

## బీజేవైఎం నేత మంద మహేష్ డిమాండ్



**వరంగల్ వాయిస్, గణపురం :** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగ మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతర నేపథ్యంలో గణపురం మండలంలో నెలకొన్న ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా పాఠశాలలకు సెలవులు ప్రకటించాలని బీజేవైఎం కళాశాలల రాష్ట్ర కన్వీనర్ మంద మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గణపురం మండల కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 28 నుంచి 31 వరకు జరిగే జాతరకు కోట్లాది మంది భక్తులు తరలివస్తున్నారని, దీనివల్ల గణపురం మీదుగా వెళ్లే ప్రధాన రహదారులన్నీ బస్సులు, భారీ వాహనాలతో కిక్కిరిసిపోతున్నాయని మహేష్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల నుండి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైకిళ్లపై ప్రయాణిస్తూ ఈ ట్రాఫిక్‌లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రహదారులు దాటే సమయంలో ప్రాణాపాయం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో జాతర సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మూడు, నాలుగు రోజులు విద్యాసంస్థలకు సెలవులు ఇచ్చే ఆనవాయితీ ఉండేదని, కానీ ఈసారి ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదని ఆయన విమర్శించారు. "ఏదైనా ప్రమాదం జరిగి విద్యార్థులకు హాని కలిగితే దానికి బాధ్యులు ఎవరు?" అని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యార్థుల ప్రాణాల కంటే ముఖ్యం ఏదీ కాదని, జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి ఈ నాలుగు రోజులు సెలవు ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేవైఎం నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని తమ మద్దతు తెలిపారు.

# మిత్రుడి కుటుంబానికి అండగా దోస్తులు



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** కలిసి చదువుకున్నారు.. కలిసి ఆడుకున్నారు.. కానీ విధి ఆ మిత్రుడిని దూరం చేసింది. తన స్నేహితుడు లేకపోయినా, అతని కుటుంబం రోడ్డున పడకూడదనే ఉద్దేశంతో ఆ పదో తరగతి మిత్రులంతా ఏకమయ్యారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పాపయ్యపేట గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మేడి తిరుపతి కుటుంబానికి అతని పదో తరగతి స్నేహితులు బుధవారం రూ.20,000 ఆర్థిక సహాయాన్ని అందించి తమ ఉదారతను చాటుకున్నారు.చిన్నప్పటి నుంచి తమతో కలిసి పెరిగిన తిరుపతి అకాల మరణం చెందడం తీరని లోటని స్నేహితులు ఆవేదన వ్యక్తం చేశారు. మాతో కలిసి ఆటపాటలతో గడిపిన క్షణాలు ఎన్నటికీ మరువలేమని బాధాతప్త హృదయాలతో స్మరించుకున్నారు. "తిరుపతి భౌతికంగా మా మధ్య లేకపోయినా, అతని పిల్లల భవిష్యత్తుకు, ఆ కుటుంబానికి స్నేహితులుగా ఎల్లవేళలా మా శాయశక్తులా అండగా ఉంటాం" అని వారు భరోసా ఇచ్చారు. కష్టకాలంలో స్పందించి ఆర్థిక సాయం చేసిన మిత్రులను గ్రామస్థులు అభినందించారు.

# ఆరూరి 'సొంతగూటికి'..

## పర్వతగిరిలో గులాబీ శ్రేణుల సంబరాలు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకోవడంతో పర్వతగిరి మండలంలో గులాబీ శ్రేణులు పండగ చేసుకుంటున్నాయి. ఆయన మళ్లీ సొంతగూటికి చేరుతుండటం పార్టీలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. బుధవారం పర్వతగిరి మండలం నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు వాహనాలలో కాన్వాయ్‌గా బయలుదేరి ఆరూరి రమేష్ వెంట హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌కు వెళ్లారు. తమ నాయకుడు మళ్లీ కారు ఎక్కుతుండటంతో జై తెలంగాణ, జై ఆరూరి నినాదాలతో మండల కేంద్రం మార్మోగింది. ఆరూరి రమేష్ చేరికతో పర్వతగిరి మండలంతో పాటు వర్ధన్నపేట నియోజకవర్గం మొత్తం బీఆర్ఎస్‌కు పాత వైభవం వస్తుందని, పార్టీ మరింత బలోపేతం అవుతుందని స్థానిక నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు. గత పదేళ్లలో ఆయన చేసిన అభివృద్ధి పనులే మళ్లీ తమను గెలిపిస్తాయని కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# ఐఎంఏ సేవలు అభినందనీయం

## భక్తులకు 10 వేల మాస్కులు పంపిణీ



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** దక్షిణ భారత కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర నేపథ్యంలో భక్తుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) వరంగల్ శాఖ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని కాకతీయ విశ్వవిద్యాలయ దూరవిద్య సంచాలకులు ఆచార్య బి.సురేష్ లాల్, డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఆచార్య ఎన్. వాసుదేవ రెడ్డి కొనియాడారు. జాతరకు తరలివచ్చే కోట్లాది మంది భక్తులలో అంటువ్యాధులు, దగ్గు, శ్వాసకోశ వ్యాధులు ప్రబలకుండా ఐఎంఏ వరంగల్ శాఖ 10 వేల మాస్కులను విరాళంగా అందజేసింది. వీటిని విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం వలంటీర్ల ద్వారా భక్తులకు పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా ఐఎంఏ బాధ్యులను యూనివర్సిటీ అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ఇలాంటి భారీ జాతరల్లో భాగస్వామ్యం కావడం అవసరమని అధికారులు అభిప్రాయపడ్డారు. ఐఎంఏ వరంగల్ అధ్యక్షులు డాక్టర్ పి.మన్మోహన్ రాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్.శిరీష్ కుమార్, ఫైనాన్స్ సెక్రటరీ డాక్టర్ వి.నరేష్ కుమార్ ఈ సేవా కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.దీపా జ్యోతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ టి.రాధికా, పీఆర్ఓ డాక్టర్ పృథ్వీ రాజు వల్లాల పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే నాగరాజును కలిసిన రబ్బానీ



**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ:** వరంగల్ ఎల్బీ నగర్‌కు చెందిన ప్రముఖ ఆక్యు ప్రెషర్ థెరపిస్ట్ మహమ్మద్ రబ్బాని బుధవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలే రబ్బాని హజ్ యాత్ర ముగించుకుని తిరిగి వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు ఆయనను సాదరంగా ఆహ్వానించి, యాత్ర విశేషాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రబ్బాని ఎమ్మెల్యేకు హజ్ యాత్ర ప్రసాదాన్ని (తబారుక్) అందజేశారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే చేస్తున్న కృషిని రబ్బాని ఈ సందర్భంగా కొనియాడారు.

# టీజీ ఎడ్ సెట్ –2026 నోటిఫికేషన్ విడుదల



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలోని విద్యాసంస్థల్లో బీఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టీజీ ఎడ్ సెట్ –2026 కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నోటిఫికేషన్ షెడ్యూల్ ఖరారైంది. బుధవారం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో చైర్మన్ ఆచార్య వి.బాలకిష్టా రెడ్డి, ఎడ్ సెట్ చైర్మన్, వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కీలక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉన్నత విద్యామండలి వెల్లడించిన వివరాల ప్రకారం పరీక్షా షెడ్యూల్ నోటిఫికేషన్ విడుదల ఫిబ్రవరి 20, 2026, ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభం ఫిబ్రవరి 23, 2026, అపరాధ రుసుము లేకుండా చివరి తేదీ ఏప్రిల్ 18, 2026, పరీక్ష నిర్వహణ తేదీ మే 12, 2026 (రెండు సెషన్లలో) గా విడుదల చేశారు. ఈ సమావేశంలో టీజీ సీహెచ్ఈ వైస్ చైర్మన్‌లు ఆచార్య ఈ.పురుషోత్తం, ఆచార్య ఎస్.కే.మహమూద్, సెక్రటరీ ఆచార్య శ్రీరామ్ వెంకటేష్, టీజీ ఎడ్ సెట్ కన్వీనర్ ఆచార్య బి.వెంకట్రామరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పరీక్షను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) పద్ధతిలో మే 12న రెండు సెషన్లలో నిర్వహించనున్నట్లు కన్వీనర్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

# గుప్పుమంటున్న గుడుంబా





- సమ్మక్క, సారలమ్మ పేరిట బెల్లం, పటిక అమ్మకాలు
- పరకాల కేంద్రంగా చీకటి దందా
- కోట్లకు పడగెత్తిన వ్యాపారులు

**వరంగల్ వాయిస్, పరకాల :** మేడారం జాతర వస్తుందంటే భక్తులకు భక్తి పారవశ్యం.. కానీ కొందరు వ్యాపారులకు మాత్రం అది అక్రమ సంపాదనకు అక్షయపాత్రలా మారింది. పరకాల కేంద్రంగా గుడుంబా తయారీకి వాడే ముడిపదార్థాల విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అమ్మవార్లకు సమర్పించే 'బంగారం' (బెల్లం) పేరుతో గుడుంబా తయారీకి ఉపయోగించే తెల్ల బెల్లం, పటికను విక్రయిస్తూ వ్యాపారులు కోట్లకు పడగెత్తుతున్నారు. ఈ చీకటి దందాపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా, అధికారులు మాత్రం 'నిమ్మకు నీరెత్తినట్లు' వ్యవహరిస్తుండటం గమనార్హం.

### దేవుడి పేరుతో దగా..

సాధారణంగా మేడారం జాతర సమయంలో భక్తులు తమ మొక్కుల కోసం టన్నుల కొద్దీ బెల్లాన్ని కొనుగోలు చేస్తుంటారు. ఇదే అదునుగా పరకాల పట్టణంలోని పలు స్టాక్ పాయింట్లు, కిరాణా దుకాణాలు జాతర ముసుగులో గుడుంబా తయారీదారులకు ముడిసరుకును సరఫరా చేస్తున్నాయి. గతంలో ప్రభుత్వం నల్ల బెల్లాన్ని నిషేధించినప్పటికీ, ప్రస్తుతం తెల్ల బెల్లం, ఈస్ట్, పటిక వంటి పదార్థాలను గుడుంబా తయారీకి వాడుతున్నారు. పట్టపగలే బహిరంగంగా ఈ విక్రయాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

### అమ్మకాల్లో మొదటి స్థానం..

సమ్మక్క–సారలమ్మ జాతర ముసుగులో పరకాల పట్టణంలోని పలు కిరాణా దుకాణాలు అధిక మొత్తంలో గుడుంబా తయారీకి అవసరమైన పదార్థాలు విక్రయిస్తూ పరకాలను టాప్‌లో నిలిపినట్లు ఆరోపణలు ఉన్నాయి. చెక్కర, ఈస్ట్ ఫౌండ్రీల నుంచి వచ్చే పట్టికలు కూడా బహిరంగంగానే అమ్మకాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీనిపై సంబంధిత శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. జాతర ముసుగులో అక్రమంగా బెల్లం పట్టపగలే విక్రయిస్తున్న దుకాణాలను నియంత్రించలేని పరిస్థితిలో అధికారులు ఉన్నారని పరకాల పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులకు కనీసం రోజువారీ పర్యవేక్షణ కూడా భారంగా మారిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ వ్యవహారంపై వెంటనే చర్యలు తీసుకోకపోతే గ్రామాల్లో గుడుంబాకు బానిసై కొన్ని కుటుంబాలు. రోడ్డున పడేపరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యవస్థను ఇలాగే వదిలేస్తే మరింత తీవ్రరూపం దాల్చుతుందని పరకాల పట్టణ, మండల ప్రజలుఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### అధికారుల అండదండలేనా?

పరకాలలో సాగుతున్న ఈ అక్రమ దందా వెనుక అధికారుల హస్తం ఉందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన అధికారులు కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నారని, మామూళ్ల మత్తులో తూతూమంత్రంగా తనిఖీలు చేస్తున్నారని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. వ్యాపారులకు, అధికారులకు మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందాల వల్లే ఈ అక్రమ అమ్మకాలు టాప్ గేర్‌లో సాగుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### చితికిపోతున్న సామాన్యుడి బతుకు..

పరకాల కేంద్రంగా సరఫరా అవుతున్న ఈ ముడిసరుకుతో గ్రామాల్లో గుడుంబా తయారీ మళ్లీ ఊపందుకుంది. దీనికి బానిసలై అనేక కుటుంబాలు వీధిన పడుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, పరకాలలో అక్రమంగా బెల్లం, పటిక నిల్వ ఉంచిన గోడౌన్లపై దాడులు నిర్వహించాలని, ఈ దందాను అరికట్టి సామాన్యుల ప్రాణాలను కాపాడాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# అగ్రంపహాడ్ భక్తి పారవశ్యం

- గద్దెకు చేరిన సారలమ్మ
- మినీ మేడారంలో మొదలైన జాతర



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మినీ మేడారంగా ప్రసిద్ధిగాంచిన అగ్రంపహాడ్ సమ్మక్క–సారలమ్మ జాతర బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. భక్తుల జయజయధ్వానాలు, పూజారుల మంత్రోచ్చారణల మధ్య సారలమ్మ తల్లి గద్దెకు చేరుకోవడంతో జాతర మహాఘట్టం మొదలైంది. పూజారులు సంప్రదాయబద్ధంగా పసుపు కుంకుమలు, ఘటం, వరాల కుండలు మరియు వనాన్ని గద్దెలకు తీసుకువచ్చారు. సారలమ్మ పూజారి గోనెల సాంబశివరావు నివాసం నుండి అమ్మవారిని బాజాభజంత్రీలు, డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య భక్తజన సందోహం తోడురాగా గద్దెకు తీసుకువచ్చారు. ఈ క్రమంలో భక్తులు ఎదురుకోళ్లు ఎగురవేసి, పొర్లుదండాలు పెట్టి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు భారీగా తరలివచ్చి



కొబ్బరికాయలు, పసుపు కుంకుమలు మరియు నిలువెత్తు బంగారాన్ని (బెల్లం) సమర్పించి దర్శించుకోవడంతో అగ్రంపహాడ్ మొత్తం భక్తి పారవశ్యంలో మునిగితేలింది. భక్తుల సౌకర్యార్థం వివిధ శాఖల ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆత్మకూర్ మండల వైద్యాధికారి డాక్టర్ స్పందన నేతృత్వంలో 50 మంది వైద్య బృందం, రెడ్ క్రాస్ సొసైటీ సేవలందిస్తున్నారు. సంరక్ష ఆసుపత్రి వారు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పోలీస్ శాఖ కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తోంది. జాతర ప్రత్యేక అధికారి, ఆర్డీవో నారాయణ, తాసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో పంచాయతీరాజ్ అధికారులు సేవలందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ బీరం సునంద సుధాకర్ రెడ్డి, మాజీ చైర్మన్ బోరిగం స్వామి, చైర్మన్ వంచ రంగారెడ్డి, అగ్రంపహాడ్ సర్పంచ్ గంగుల మహేందర్, ఈవో నాగేశ్వరరావు, పూజారులు పాల్గొని జాతరను పర్యవేక్షిస్తున్నారు.

# దీపికా నా లక్కీ..



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబోలో పాన్ వరల్డ్ రేంజ్ సైన్స్ ఫిక్షన్ మూవీ రాబోతోన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ సాగుతుండగా... తాజాగా ఓ మీడియా సంస్థకు డైరెక్టర్ అట్లీ ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇంట్రెస్టింగ్ విషయాలు షేర్ చేసుకున్నారు. దీపికా పదుకోన్ తన లక్కీ ఛార్మ్ అని అన్నారు అట్లీ. 'ఈ మూవీలో దీపికా చాలా కొత్తగా కనిపిస్తారు. ఆమె నటన కట్టి పడేస్తుంది. దీపికాతో ఇది నా రెండో సినిమా. ఆమెతో వర్క్ చేయడం చాలా అద్భుతంగా ఉంటుంది. తల్లైన తర్వాత ఆమె చేస్తున్న ఫస్ట్ మూవీ. ఈ మూవీలో సరికొత్త దీపికాను చూస్తారు.' అంటూ ఆమె ప్రశంసల వర్షం కురిపించారు. ప్రభాస్ 'కల్కి 2898 AD' తర్వాత పాన్ ఇండియా స్థాయిలో దీపికా నటిస్తోన్న రెండో మూవీ ఇది. అంతకు ముందు అట్లీ దర్శకత్వంలో షారుఖ్, దీపికా ప్రధాన పాత్రల్లో నటించిన 'జవాన్' మూవీ సంచలన విజయం సాధించిన సంగతి తెలిసిందే.

**ఫ్యాన్స్‌కు బిగ్ సర్ప్రైజ్**

అల్లు అర్జున్ మూవీతో ఫ్యాన్స్‌కు బిగ్ సర్ప్రైజ్ సిద్ధం చేస్తున్నామని అట్లీ అన్నారు. 'ప్రతీ రోజూ కొత్త విషయాలు నేర్చుకుంటున్నాం. మంచి అవుట్ పుట్ ఇవ్వడం కోసం నిద్ర లేని రాత్రులు గడుపుతున్నాం. ప్రతీ ఒక్కరి కోసం భారీ ప్రాజెక్ట్ రెడీ చేస్తున్నాం. ఫ్యాన్స్‌తో పాటు మేము కూడా చాలా ఉత్సాహంగా ఉన్నాం. మా టీం మొత్తం ఎంతో శ్రమిస్తోంది. ఇది పూర్తయ్యాక అందరూ మూవీని చాలా ఎంజాయ్ చేస్తారు.' అంటూ చెప్పారు.

ఇక బన్నీ రోల్‌పై మాట్లడుతూ.. పునర్జన్మలు, సమాంతర ప్రపంచం బ్యాక్ డ్రాప్‌గా ఈ మూవీ రూపొందిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. మూడు డిఫరెంట్ రోల్స్‌లో బన్నీ కనిపిస్తారనే టాక్ వినిపిస్తోంది. మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ, విజువల్ ఎఫెక్ట్స్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తుండగా... సిల్వర్ స్క్రీన్‌పై ఇప్పటివరకూ చూడని ఓ అద్భుతాన్ని చూపించనున్నట్లు సమాచారం.



# ఓటీటీలో.. ఆది డ్రైవ్

యంగ్ హీరో ఆది పినిశెట్టి ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ సైబర్ క్రైమ్ థ్రిల్లర్ 'డ్రైవ్'. గతేడాది డిసెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. ఇప్పటికే ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతున్న మూవీ మంచి రెస్పాన్స్ అందుకుంటుండగా... మరో ఓటీటీలోకి కూడా వచ్చేందుకు రెడీ అవుతోంది.

ఇప్పుడు తెలుగు ఓటీటీ 'ఆహా'లోనూ ఈ నెల 30 నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతో పాటు తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో అందుబాటులోకి రానుంది.

ఈ మూవీకి జెనుస్ మహమ్మద్ దర్శకత్వం వహిస్తుండగా... ఆది పినిశెట్టి సరసన మడోన్నా సెబాస్టియన్ హీరోయిన్‌గా నటించారు. భవ్య క్రియేషన్స్ బ్యానర్‌పై వి.ఆనంద ప్రసాద్ నిర్మించారు.

**కథ విషయానికి వస్తే..**

పవర్ ఫుల్ మీడియా టైకూన్ జై (ఆది పినిశెట్టి) దేశంలోనే పేరు మోసిన వ్యక్తి. తన తండ్రి వారసత్వంగా వచ్చిన మీడియా రంగాన్ని దేశంలోనే నెంబర్ 1గా నిలుపుతాడు. అయితే, తన స్వార్థం కోసం ప్రతిపక్ష మీడియాకు ఆ ఫేమ్ అమ్మేయాలని అనుకుంటాడు. ఈ డీల్ క్లోజ్ అయ్యే లోపే ఫ్యామిలీతో కలిసి విదేశాలకు పారిపోవాలని ప్లాన్ చేస్తాడు. ఇంతలోనే అతని బ్యాంక్ ట్రాన్సాక్షన్స్ సహా మొబైల్ ఫోన్, ల్యాప్ టాప్ అన్నీ కూడా హ్యాకింగ్‌కు గురవుతాయి. అపరిచిత వ్యక్తి జైకు ఫోన్ చేసి బెదిరించి మరీ అన్నింటినీ లీక్ చేస్తాడు. ఈ క్రమంలో తీవ్ర ఇబ్బందుల పాలవుతాడు జై. తన పవర్, ఫేం అన్నీ ఒక్కొక్కటిగా దూరమవుతాయి. తన ఫ్రెండ్స్‌తో కలిసి చిన్నప్పుడు చేసిన ఓ తప్పిదమే వీటన్నింటికీ కారణమని తెలుసుకుంటాడు జై. అసలు అతను చేసిన తప్పేంటి? అపరిచిత వ్యక్తి ఎందుకు జైను టార్గెట్ చేశాడు? వరల్డ్‌లోనే మోస్ట్ వాంటెడ్ హ్యాకర్‌గా జై ఎలా మారాడు? అనేది తెలియాలంటే మూవీ చూడాల్సిందే.



# అనసూయకు అభిమాని గుడి




తాజాగా... యాంకర్ అనసూయకు గుడి కడతానంటూ ఓ అభిమాని చెప్పడం సోషల్ మీడియాలో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. అనసూయ అభిమాన సంఘం అధ్యక్షుడిని అంటూ చెప్పుకొనే మురళీ శర్మ... ఈ అనౌన్స్‌మెంట్ చేశాడు. అయితే, దీనికి ఆమె పర్మిషన్‌తో రాష్ట్ర ప్రభుత్వ అనుమతి కూడా కోరతామని చెప్పాడు.

అసలెవరీ మురళీ శర్మ?

హీరోయిన్ డ్రెస్సింగ్ అంశంపై నటుడు శివాజీ చేసిన కామెంట్స్ పెద్ద దుమారం రేపిన వేళ అనసూయ శివాజీ తీరును తప్పుబట్టారు. ఈ అంశం కొద్ది రోజుల క్రితం హాట్ టాపిక్ కాగా... పలు ఛానళ్లలో వరుస డిబేట్స్ సాగాయి. తనను తాను అనసూయ అభిమాన సంఘానికి అధ్యక్షుడిని అని చెప్పుకొనే మురళీ శర్మ ఆమెకు ఫుల్ సపోర్ట్ ఇచ్చారు. అనసూయ అంటే తనకు గౌరవం ఉందని... శివాజీ కామెంట్స్‌పై ఆమె ఇచ్చిన కౌంటర్‌కు సపోర్ట్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు వీడియోలు సైతం రిలీజ్ చేశారు.

రీసెంట్‌గా ఓ యూట్యూబ్ ఛానల్ ఇంటర్వ్యూలో మాట్లాడిన మురళీ శర్మ... 'అనసూయ అంటే నాకు అపారమైన గౌరవం. ఆమె అనుమతి ఇస్తే గుడి కడతాం. అవసరమైతే ప్రభుత్వ అనుమతి కూడా తీసుకుంటాం. ఇక్కడ పూజారులు ఉండాల్సిన పని లేదు. ప్రేమతో ఓ గులాబీ పెట్టినా చాలు. గతంలో ఇలాగే నటి ఖుష్బూ, సమంతకు కూడా గుడి కట్టారు. అలానే అనసూయకు కూడా గుడి నిర్మించాలనేది ఆమె అభిమానుల ఆకాంక్ష.' అంటూ చెప్పారు.

దీనిపై సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 'నిజంగానే గుడి కడతారా?', 'పనులు ఎప్పుడు, ఎక్కడ మొదలు పెడతారు?' అంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరి దీనిపై అనసూయ ఎలా రియాక్ట్ అవుతుందో చూడాల్సి ఉంది.

# బోర్డర్- 2 బాక్సాఫీస్ ప్రభంజనం




సన్నీ డియోల్ నటించిన ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. నార్త్ ఆడియన్స్ చాలా మంది ఈ సినిమాను చూడటానికి థియేటర్లకు వెళుతున్నారు. దాంతో భారీ వసూళ్లు సాధిస్తోంది. విడుదలైన నాలుగు రోజుల్లోనే ఈ చిత్రం 180 కోట్ల రూపాయల నెట్ కలెక్షన్ రాబట్టింది. 'బోర్డర్ 2' విడుదలైన 5వ రోజు ఎంత వసూలు చేసిందంటే?

జనవరి 23న విడుదలైన 'బోర్డర్ 2' చిత్రానికి విమర్శకులు, ప్రేక్షకుల నుండి మంచి స్పందన లభించింది. చిత్ర కథ, సినిమాలోని యుద్ధ సన్నివేశాలు, ప్రధాన తారాగణం నటనకు ప్రశంసలు లభించాయి. దాంతో ఈ సినిమా ట్రెండింగ్‌లో ఉంది. థియేటర్లలో సందడి చేస్తోంది. విడుదలైన మొదటి రోజు నుండి ప్రేక్షకుల నుండి చక్కటి ఆదరణ లభిస్తోంది. అది ఇంకా పెరుగుతూనే ఉంది. అలాగే వసూళ్లలో కూడా రోజురోజుకూ పెరుగుదల కనిపిస్తోంది. వీటన్నిటి మధ్య, సినిమా వసూళ్ల గురించి మాట్లాడితే 'బోర్డర్ 2' విడుదలైన మొదటి రోజున 30 కోట్లు కలెక్ట్ చేసింది. రెండవ రోజున 21.67 శాతం వృద్ధితో 36.5 కోట్లు వసూలు చేసింది. మూడవ రోజున, సినిమా వసూళ్లు 49.32 శాతం వృద్ధితో 54.5 కోట్లు రాబట్టింది. నాలుగవ రోజున 'బోర్డర్ 2' 8.26 శాతం వృద్ధితో 59 కోట్లు వసూలు చేసింది.

సకనిల్క్ నివేదిక ప్రకారం... విడుదలైన 5వ రోజు అంటే మంగళవారం 'బోర్డర్ 2' 19.50 కోట్ల రూపాయలు వసూలు చేసింది. దీంతో 'బోర్డర్ 2' 5 రోజుల మొత్తం వసూళ్లు ఇప్పుడు 196.50 కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. ఇండియాలో నెట్ కలెక్షన్ ఇది. 'ధురంధర్' రికార్డును బద్దలు కొట్టలేదు కానీ... 'బోర్డర్ 2' వసూళ్లలో మంగళవారం తగ్గుదల కనిపించినప్పటికీ... అద్భుతమైన వసూళ్లు సాధించింది. గత నాలుగు రోజులుగా 'ధురంధర్'ను బీట్ చేస్తున్న 'బోర్డర్ 2'... విడుదలైన 5వ రోజున మాత్రం ఆ సినిమా రికార్డును బద్దలు కొట్టలేకపోయింది. ధురంధర్ 5వ రోజున 27 కోట్లు వసూలు చేయగా, 'బోర్డర్ 2' వసూళ్లు 19.50 కోట్ల రూపాయలుగా ఉన్నాయి. నార్త్... అంటే హిందీ మార్కెట్ వరకూ చూస్తే, ఆర్ఆర్ఆర్ రౌద్రం రణం రుధిరం, కల్కి 2898 ఏడీ సినిమాల కలెక్షన్ విడుదలైన ఐదో రోజు 19 కోట్ల కంటే తక్కువ అని ట్రేడ్ వర్గాల టాక్.

# వనమంతా జనం

- మేడారం అడవుల్లో దైవత్వం
- లక్షలాదిగా తరలివస్తున్న భక్తులు





















## ట్రాఫిక్ పై సీపీ నజర్

☐ సీసీ కెమెరాల నిఘాలో జాతర మార్గం

**వరంగల్ వాయిస్, క్రైం :** మేడారం మహాజాతర వేళ భక్తుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణే లక్ష్యంగా పోలీస్ శాఖ అత్యాధునిక నిఘా ఏర్పాటు చేసింది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి నుంచి గద్దెల వరకు ప్రతి వాహనం కదలికలను కెమెరాల్లో బంధించనున్నారు. ఇందుకోసం ట్రై సిటీ పరిధిలో 715, మేడారం మార్గంలో 530 సీసీ కెమెరాలను అమర్చి, కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా క్షణాల్లో గుర్తించేలా వ్యవస్థను సిద్ధం చేశారు. బుధవారం నుంచి ప్రారంభమైన మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర సందర్భంగా వరంగల్ నగరం నుంచి మేడారం గద్దెల వరకు కొనసాగే రోడ్డు మార్గంలో, వాహనాల రాకపోకలపై వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పర్యవేక్షించారు. పస్రా, తాడ్వాయి జంక్షన్ల వద్ద ట్రాఫిక్ కొనసాగుతున్న తీరును క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయడంతో పాటు, ఆయా సెక్టార్ అధికారులకు సీపీ పలు సూచనలు చేశారు.





## అమ్మవారిపేటకు క్యూ కట్టిన జనం

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** నగరంలోని దామెర గుట్టల్లో కొలువై ఉన్న అమ్మవారిపేట శ్రీ సమ్మక్క, సారలమ్మ జాతరకు జనం క్యూ కట్టారు. సమ్మక్క సారలమ్మ జాతర మహా ఘట్టం బుధవారం సాయంత్రం మొదలైంది. భక్తజన సందోహం మధ్యన ముందుగా పూజారులు సాంప్రదాయ బద్ధకంగా పసుపు కుంకుమలను గద్దెలకు చేర్చారు. జాతర చైర్మన్ కోడూరు భిక్షపతి, జాతర ఆర్గనైజర్ దాసి రామ్ దేవ్, కోశాధికారి బైరి నాగరాజు, బైరి హరి, నక్క కొమురయ్య యాదవ్, చింత ప్రకాష్, జలగం రంజిత్, అవునూరి కుమారస్వామి, ఆవు నూరి రవి, మరుపల రవి, బత్తిని వసుంధర, మంథని సునీత, పోశాల స్వామి, ఆవునూరి భిక్షపతి, పూస సుభద్ర, పూజారులు బైరశెట్టి శ్యాంసుందర్, బైరి ఈశ్వరయ్య నామని శివమూర్తి, బైరి కిరణ్ తదితరుల సమక్షంలో సారలమ్మను గద్దె మీదకు తీసుకొచ్చారు. భాజా భజంత్రీలు, డప్పు చప్పుల్లు, శివసత్తుల పూనకాలు నడుమ సారలమ్మ గద్దెలపై కూర్చుంది. దీంతో ఆ ప్రాంతం భక్తజన సందోహంగా మారింది. సారలమ్మకు భక్తులు పొర్లుదండాలు పెట్టి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తి పరవశ్యలో మునిగితేలారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొబ్బరికాయలు, పసుపు, కుంకుమలు నిలువెత్తు బంగారంతో వనదేవతలను దర్శించుకున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com